క్లుప్తంగా

భక్తుల వద్దకే భద్రాద్రి రాముడి తలంబ్రాలు

మణుగూరుటౌన్: ఆర్టీసీ కార్గో ద్వారా భక్తుల వద్దకే భద్రాద్రి రాముడు తలంబ్రాలు అందించడానికి మణుగూరు ఆర్టీసీ డిపో సిద్ధంగా ఉందని డిపో మేనేజర్ టి.స్వామి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీతారామ చంద్ర స్వామి వారి కల్యాణానికి వెళ్లలేని భక్తులు కార్గో సెంటర్ల వద్ద రూ.116 చెల్లించి ఎంతో పవిత్రమైన సీతారాములు ముత్యాల తలంబ్రాలు పొందవచ్చన్నారు. మణుగూరు డిపో పరిధిలోని సురక్షాబస్టాండ్, అశ్వాపురం బస్టాండ్, మెండికుంట, కరకగూడెం, బయ్యారం కార్గో సెంటర్స్‌లో తలంబ్రాలు బుక్‌చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు మణుగూరు డిపో మార్కెట్ ఎగ్జిక్యూటివ్ సైదులు 9154298588లకు సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయురాలికి ప్రశంస

దుమ్ముగూడెం: మండలంలోని నరసాపురం సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయురాలు జెట్టి పద్మకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వారు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శనివారం అడ్వాన్స్ ఇన్ మ్యాథమెటిక్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్ అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌కి పలు యూనివర్సిటీల నుంచి అధ్యాపకులు తదితరులు హాజరయ్యారు. ఇందులో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో పద్మ.. 'యాక్టివ్ బేస్ లెర్నింగ్ ఇన్ సెకండరీ స్కూల్ లెవల్' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమెను అభినందిస్తూ నిర్వాహకులు ప్రశంసా పత్రం అందజేశారు.

నేటి నుంచి పోస్టల్ మేళా

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం పోస్టల్ సబ్ డివిజన్ పరిధిలో సోమవారం నుంచి పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ మేళాలు నిర్వహిస్తున్నట్లు భద్రాచలం నార్త్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌చార్జ్ ఏఎస్పీ వి.సుచెందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పీఎల్ఐ పథకం వర్తించేదని, కాని ఇప్పుడు పోస్టల్ శాఖ పట్టభద్రులకు, డిప్లొమా అయిన వారికి కూడా అవకాశం కల్పిస్తోందని తెలిపారు. పీఎల్ఐ పథకంలో 19 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వారికి అవకాశం ఉందన్నారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ 50 లక్షల వరకు పొందే అవకాశం పోస్టల్ శాఖ కల్పించిందని, ఈ నెల 31 వరకు పీఎల్ఐ చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. పట్టభద్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్యే పర్యటన

అశ్వాపురం: మండలంలో ఆదివారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పర్యటించారు. వెంకటాపురం గ్రామంలో సర్పంచ్ మడకం సాధు కుమార్తెల ఓణీల అలంకరణ వేడుకకు ఎమ్మెల్యే రేగా హాజరై ఆశీర్వదించారు. తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలోని బండ్ల వారి గుంపు గ్రామానికి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు తాటి ఈశ్వర్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎమ్మెల్యే రేగా పరామర్శించారు. స్థానిక నూతన వధూవరులను ఆశీర్వదించారు. రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి, ఎంపీటీసీ తాటి పూజిత, సీనియర్ నాయకుడు జాలె రామకృష్ణారెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, రామారావు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన నిరుపేద వృద్ధుడు కోండ్రు చంద్రయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆయన భార్య చంద్రయ్య దహనసంస్కారాలకు చేతిలో చిల్లిగవ్వ లేక ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తోంది. సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న పలువురు వృద్ధుడి దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క కుమారుడు కాంగ్రెస్ నాయకుడు ధనసరి సూర్య రూ.3 వేలు, అశ్వాపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్ 2 వేలు, 50 కేజీల బియ్యం, అశ్వాపురం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ చందూలాల్ రూ.2 వేలు, స్థానికుడు యార్లగడ్డ బలరాం రూ.2 వేలు, క్వింటా బియ్యం, చవిటిగూడెం గ్రామానికి చెందిన యాదవ సంఘం కుల పెద్దలు, ఎంపీపీ ముత్తినేని సుజాత, వేములపల్లి రమేష్ ఆర్థిక సహాయం అందజేసి వృద్ధురాలికి అండగా నిలిచారు.

బిల్లులు చెల్లించాలి

భద్రాచలంటౌన్: ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెషన్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. సమావేశంలో తాటి సత్తిబాబు, పద్దం రాంబాబు, బోదేబోయిన కాంతారావు పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రభుత్వ పాఠశాల

- నిరుపయోగంగా పాఠశాల గదులు
- శిథిలావస్థకు చేరుకున్న వంటశాల
- మూత్రశాలలు సరిగా లేక విద్యార్థినుల అవస్థలు
- ప్రహరీ లేక జంతువుల సంచారం


శిథిలావస్థకు చేరిన వంటశాల


తరగతి గదిలో పేరుకుపోయిన చెత్తాచెదారం


పగిడేరు ప్రాథమికోన్నత పాఠశాల

మణుగూరురూరల్: మణుగూరులోని పగిడేరు గ్రామపంచాయతీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల ఆవరణలో గతంలో నిర్మించిన తరగతి గదులు నిరుపయోగంగా ఉన్నాయి. గదుల పైకప్పు పెచ్చులు ఊడిపోయి పడిపోవడంతో తరగతి గదిలోకి విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్లాలంటే భయాందోళనలకు గురౌతున్నారు. తరగతి గదులు నిరుపయోగంగా ఉండడంతో కుప్పకుప్పలుగా చెత్త పేరుకుపోయి విష కీటకాలకు నిలయంగా మారాయి. పగిడేరు ప్రాంతం అటవీ ప్రాంతంలో ఉండడం వల్ల విద్యాశాఖ అధికారులు పగిడేరులోని ఈ ప్రభుత్వ పాఠశాలను పట్టించుకోవడం లేదన్న వదంతులు గ్రామంలో వినబడుతున్నాయి.

వంటలకు తంటాలు..

పగిడేరులోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న వంటశాల శిథిలావస్థకు చేరుకుంది. వంటశాల పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో నిరుపయోగంగా మారి గది కింది భాగం పందికొక్కులకు, ఎలకలకు ఆవాస కేంద్రంగా మారింది. వంటశాల సరిగా లేకపోవడం వల్ల ఆయాలు తమ ఇంటి వద్దే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసుకుని వస్తున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనమూ ఉండడం లేదని గ్రామస్తులు తెలిపారు.

సరిగా లేని తలుపులతో ముత్రశాలలు..

పగిడేరు ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల మూత్రశాలలు సరిగా లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా విద్యార్థినులకు మూత్రశాలలు సరిగా లేకపోవడం, ఉన్నా తలుపులు సక్రమంగా లేకపోవడంతో ఆరుబయటే మలమూత్ర విసర్జనలు చేస్తున్న పరిస్థితి నెలకొంది.

బెంబేలెత్తుతున్న విద్యార్థులు

పగిడేరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు రావాలంటే విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదులు, కూలిపోయిన ప్రహరి విద్యార్థులకు ఈ పాఠశాల స్వాగతం పలుకుతోంది. గోడ కూలడంతా జంతువులు పాఠశాలలోకి రావడం, విద్యార్థులు భయపడడం సాధారమైపోయింది. రాత్రి సమయంలో ఆకతాయిలు పాఠశాల ఆవరణలోనే మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని గ్రామపెద్దలు పేర్కొంటున్నారు. అసలే పగిడేరు గ్రామం మారుమూల ప్రాంతంలో ఉండి.. ఇక్కడి పాఠశాలలో కనీసం సౌకర్యాలు లేకపోవడంతో పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గిందని గ్రామస్తులు చెబుతున్నారు. పగిడేరులోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆదివారం చెక్కులు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు తహసీల్దార్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. 56 మంది లబ్ధిదారులకు ఈ పథకం రూ.56లక్షల 06 వేల 496 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదలకు కల్యాణ సమయానికే చెక్కులు అందేలా చర్యలు తీసుకుంటే పేద కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, సర్పంచ్ సరియం రాజమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరయ్య

దాతృత్వం చాటుకున్న ఎమ్మెల్యే

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం వద్దగల చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం వద్ద జరిగే జాతర ఉత్సవాల్లో వివిధ రకాల దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు వచ్చిన చిరు వ్యాపారులు భారీ వర్షం, ఈదురు గాలుల అవస్థలు పడ్డారు. వర్షం కారణంగా చిరు వ్యాపారులు భోజనాలు సిద్ధం చేసుకోలే ఇబ్బందులు పడుతుండగా, గమనించిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే తన మేనల్లుడు తాటి ప్రదీప్‌ను ఆలయం వద్దకు పంపించి, దాదాపు 300 మందికి భోజనాలను ఏర్పాటు చేయించారు. అనంతరం చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే మేనల్లుడు స్వయంగా వడ్డించారు. తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులకు భోజన ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు పరీక్ష పేపర్లు


చండ్రుగొండ: పోలీస్ స్టేషన్‌లో 'పది' పరీక్షా పత్రాలను భద్రపరుస్తున్న సిబ్బంది

అన్నపురెడ్డిపల్లి: పదో తరగతి పరీక్ష పేపర్లు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ప్రత్యేక గదిలో పది పేపర్లను భద్రపరిచినట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 3 నుంచి 11వ తారీకు వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో అన్నపురెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 282 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై షాహీన, పరీక్ష చీఫ్ సూపరిండెంట్ మోహన్‌రావు, బిచ్చా, వాజీర్ తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: మండలానికి పదోతరగతి పరీక్షా పత్రాలు ఆదివారం చేరాయి. ఏప్రిల్ నెల 3 నుంచి 11 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పశ్నపత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గొల్లపల్లి విజయలక్ష్మి, ఎంఈఓ ఎస్.సత్యనారాయణ, చీఫ్ సూపరిటెండెంట్ దుర్గాప్రసాద్, నారాయణ, లఘపతి పాల్గొన్నారు.

దమ్మపేట: ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు పది పరీక్ష పేపర్లు చేరాయి. మండలంలోని అన్ని పరీక్ష కేంద్రాలకు సంబంధించిన పేపర్లను ఎంఈఓ లక్ష్మి, స్థానిక ఎస్సై శ్రావణ్ కుమార్ రిసీవ్ చేసుకుని, తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఏప్రిల్ 3వ తారీకు నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఎంఈఓ లక్ష్మి తెలిపారు.

అశ్వారావుపేటరూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు ఆదివారం అశ్వారావుపేట చేరాయి. ఈ మేరకు వార్షిక ప్రశ్నా పత్రాలు బాక్స్‌లను స్థానిక ఎంఈఓ పెండెకంట్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌కు తరలించి, వాటిని భద్రపరిచారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఫణికుమార్‌రెడ్డి, హలవత్ హరిబాబు, రాంబాబు ఉన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

దుమ్ముగూడెం: బీడు పడ్డ తెలంగాణా రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చిన అపర భగీరథుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్.. రానున్న ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఎవరెన్ని కుయుక్తులు పన్నినా ఆయన్ని ఎదుర్కోలేరని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు అన్నారు. ఆదివారం లక్ష్మీనగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ అభివృద్ధి పథకాలు తెలంగాణాలో ప్రతి ఇంటికీ అందాయని మిషన్ భగీరథ ద్వారా మంచి నీటి కష్టాలు తీరాయని అన్నారు. మిషన్ కాకతీయ తోటి భూగర్భజలాలు నిండుగా ఉన్నాయని, రైతుబంధు తోటి రైతన్నలకు పెట్టుబడి సాయం అందుతోందని వెల్లడించారు. పోడు రైతులకు పట్టాలు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. కల్యాణలక్ష్మి సాదీముభారక్ లాంటి పథకం పేదింటి ఆడబిడ్డల పాలిట వరంగా మారిందని తెలిపారు. తెలంగాణాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని.. ఈ పథకాలే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోడే తిరుపతిరావు, పార్టీ నాయకులు జానిపాషా, నడికుడి దామెర్ల శ్రీనివాసరావు, పాడుతురి నాగరాజు, పోడియం సుబ్బారావు, జిలకర గంగరాజు, జంగిటి రాము, చినబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కణితి రాముడు

కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మ దహనం

టీపీసీసీ పిలుపుమేరకు నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో సీఎం కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాలు లీకైన విషయంలో ప్రభుత్వాన్ని బాధ్యులుగా చేస్తూ ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీధుల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొలువులొస్తాయని ఆశించి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాలో ఇటువంటి సంఘటనలు దారుణమని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్


భద్రాచలం: కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే వీరయ్య, కాంగ్రెస్ నాయకులు


బూర్గంపాడు: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


మణుగూరుటౌన్: అంబేడ్కర్ సెంటర్‌లో..

శిక్షణా కేంద్రం ప్రారంభం

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలో ఎంపీజే మండలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణా కేంద్రాన్ని ఆదివారం రాత్రి ఎస్సై గొల్లపల్లి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీజే స్టేట్ సెక్రటరీ సలీముల్ హింది, ఎస్‌కె.ఖాసీం, యుసుఫ్‌పఠాన్, యండి.ఖాజాహుసేన్, పర్వీన్, ఎస్‌కె.అహ్మద్, యండి.షబ్బీర్, షబ్బు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

అశ్వాపురం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మల్లెలమడుగు గ్రామంలో క్రీడాకారులకు ఆదివారం స్థానిక నాయకులు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు రాగం మల్లయ్య, కుమ్మరి భిక్షపతి, దేవరపు శ్రీనివాస్, కమటం శంకర్, పర్వత నరేష్, కుంజా భాస్కర్, దేవంగి వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్ల వితరణ

భద్రాచలం: బెక్కంటి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్, ఆట, ఆకెళ్ల వెంకట సత్య ప్రసాద్ సౌజన్యంతో ఆదివారం రామాలయానికి సీలింగ్ ఫ్యాన్లను వితరణగా అందజేశారు. ఈఓ క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీటిని ట్రస్ట్ చైర్మన్ బెక్కంటి శ్రీనివాసరావు చేతుల మీదుగా సీఐ నాగరాజు రెడ్డి సమక్షంలో ఈఓ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా బెక్కంటి సేవా తత్పరతను ఈఓ కొనియాడారు. ఏఈఓ శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, సీసీ అనిల్‌లు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం వర్ధంతి

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలో కమ్యూనిస్టు యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఐలూరి రామిరెడ్డి, పెద్దిని వేణు, ఆర్ వెంకటాచారి, వీరభద్రం, భూపాల్, గోపాల్, తిరుపతి, గోపాలరావు పాల్గొన్నారు.

వృద్ధురాలికి వితరణ

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన పుల్లమ్మ అనే నిరుపేద వృద్ధురాలికి వీ ఫర్ యూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సహాయం చేసి ఆదుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ వృద్ధురాలు ఆరోగ్యం పరంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు.. వృద్ధురాలికి రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు, బియ్యం అందజేశారు.

బీఎస్పీతోనే అన్ని వర్గాలకు న్యాయం

అశ్వారావుపేటరూరల్: బీఎస్పీతోనే తెలంగాణలోని అన్నీ వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మడకం ప్రసాద్ దొర అన్నారు. మండల పరిధిలోని కొత్త మామిళ్లవారిగూడెం గ్రామంలో ఆదివారం సాయంత్రం ఆయన పార్టీ గుర్తు, సిద్ధాంతాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటయ్య, దుర్గయ్య, నాగేశ్వరరావు, రాంబాబు, సురేష్ పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

ములకలపల్లి: ములకలపల్లి మండలకేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానికులు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం దమ్మపేట మండడంలోని స్వగృహంలో ఎమ్మెల్యే మెచ్చాను కలిసి, మండలంలో సీసీ రోడ్లు, వంతెనలు, పీహెచ్‌సీ అదనపు భవనం, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇటీవల నిధులు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ములకలపల్లిలో సెంట్రల్‌లైటింగ్, డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మెచ్చా శాయశక్తులా కృషి చేసి, ములకలపల్లిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో పువ్వాల మంగపతి, బండి కొమరయ్య, నరాటి ప్రసాద్, మేకల పెద్దవెంకన్న, పుప్పాల చందర్‌రావు, శనగపాటి రవి, పువ్వాల శ్రీను తదితరులు ఉన్నారు,

జాతర ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం వద్దగల శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం ఉదయం నుంచి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. తెల్లవారుజాము నుంచే వేద పండితుల సమక్షంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జాతర ఉత్సవాలను ఆరంభించారు. జాతర ఉత్సవాల తొలి రోజున అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనం ఇవ్వగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బిర్రం రమాదేవి, ఆలయ ఈఓ సూర్య ప్రకాశ్‌రావు, అర్చకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్‌లోని ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయల కమిటీ అధ్యక్షుడు హరిచంద్ర నాయక్ అన్నారు. ఉత్సవాలకు సంబంధించిన వివరాలను ఆయల ఆవరణలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 22న ఉగాది పర్వదినాన ముత్యాలమ్మ అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం అమ్మవారికి గోదావరి నదిలో గంగ స్నానం నిర్వహించి ఘనంగా ఊరేగింపు కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ముత్యాలమ్మ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్

చెరువును తలపిస్తున్న పాఠశాల



మణుగూరులోని సమితిసింగారం పాఠశాల మైదానం శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువును తలపిస్తోంది. ఈ చిన్న వర్షానికే పాఠశాల ఆవరణ ఇబ్బంది కరంగా మారింది. ఈ పాఠశాలలో మండలంలోనే అత్యధిక సంఖ్యలో విద్యార్థులు విద్యనభిసిస్తుంటారు. నిత్యం పట్టణ ప్రజలు ఇక్కడ ఉదయం వాకింగ్ చేస్తారు. ఇప్పుడు పాఠశాల మైదానమంతా జలమయం అవడంతో వీరంత ఇబ్బంది పడ్డారు. అధికారులు దృష్టి సారించి పాఠశాల మైదానాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

– మణుగూరుటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి: వి.వీరస్వామి, ఎంఈఓ
ఫోన్ నంబర్: 9959087110

మూడో రోజూ వర్ష బీభత్సం

అకాల వర్షం సృష్టిస్తున్న బీభత్సం మూడోరోజూ కొనసాగింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరిపిలేని వాన కురిసింది. కోత కోసిన మిర్చి కళ్లాల్లో అరబెట్టగా వర్షం నీరు కళ్లాల్లోకి చేరి కాయ మొత్తం తడిసిపోయింది. కొన్నిచోట్ల గాలులకు మిర్చిపై కప్పిన బరకాలు ఎగిరిపోయి నష్టం వాటిల్లింది. పొగాకు, మొక్కజొన్న పంటలకు తీరని నష్టం వాటిల్లింది. మామిడి తోటల్లో ఉన్న పూత, పిందెలు రాలిపోయాయి. గాలివాన ధాటికి ఇళ్లు కూలిపోయి ప్రజలు గాయపడ్డారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూర్: పొగాకు తోటలో నిలిచిన వర్షపు నీరు


నేలరాలిన మామిడి కాయలు


గుండాల: వాలిపోయిన మొక్కజొన్న చేను


అశ్వారావుపేటరూరల్: వేదాంతపురంలో మొక్కజొన్న పంట


దుమ్ముగూడెం: కొత్తదంతెనంలో నేలకొరిగిన ఇళ్లు